www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 ఏప్రిల్ 2025



జిల్లాలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్

- అనుమానితులు, పాత నేరస్తుల ఇళ్లలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్పి ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో రికార్డులు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు వాహనం స్వాధీనం చేసుకున్నారు. బుధ, గురువారాల్లో నిర్వహించిన కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్లలో రికార్డులు లేని మొత్తం 108 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేర స్థులు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి, అనుమానితుల సమాచారాన్ని 100 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

ఎట్టకేలకు 'ఉపాధి' డబ్బులు పడ్డాయి..!

8 వారాల నిరీక్షణకు తెర బుధవారం నుంచే కూలీలకు జమ



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

జిల్లాలో పనిచేస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టం కూలీలకు ఎట్టకేలకు ప్రభుత్వం కూలి డబ్బులను వారి ఖాతాలో జమ చేసింది. 8 వారాలుగా వేతనాలు రాకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 2,26,687 మందికి జాబ్ కార్డులు ఉండగా యాక్టివ్ జాబ్ కార్డులు 1,39,500 ఉన్నాయి. ఈ కార్డులలో 85,430 మంది కూలీలు ఉపాధి పనులకు వెళున్నారు. వీరికి గతంలో పనిచేసిన వారం రోజుల లోపల వేతనాలు వారి ఖాతాలకు జమ చేసేవారు. ఈ ఏడాది పనులు చేసి 8 వారాలు పూర్తి అయినప్పటికీ వేతనాలు ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో కొన్ని గ్రామాలలో వేతనాలు ఆలస్యం అవుతున్నాయని పనులకు కూలీలు రాకుండా మానుకున్నారు.

ఎట్టకేలకు ప్రభుత్వం ఉపాధి కూలీలకు నిధులను విడుదల చేసింది. జిల్లాలో రూ 40 కోట్లు కూలీలకు జమ కావాల్సి ఉండి బుధవారం జిల్లాలోని కొన్ని మండలాలలో కూలీలకు వేతనాలు జమ అయ్యాయి. సింహాద్రిపురం మండలంలో రూ.60 లక్షలు కూలీలకు వేతనాలు జమ అయ్యాయి. కేవలం కూలీల వేతనాలు మాత్రమే జమ చేయడంలో జరిగింది. మినీ గోకులాలు, సిసి రోడ్లు, ఇతరత్రా వాటికి సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మరో రూ 70 కోట్లు జమ కావాల్సి ఉంది.

వేతనాలు రాక చాలా ఇబ్బందులు పడ్డాం...

8 వారాలుగా వేతనం రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. బుధవారం సాయంత్రం వేతనాలు ఖాతాలో జమ చేయడం జరిగింది. దీంతో కుటుంబ అవసరాలు తీర్చుకుంటాం.

-మల్లేశ్వరి, ఉపాధి కూలీ, కోరగుంటపల్లె.

పది రోజుల లోపల వేతనాలు చెల్లించాలి..

ఉపాధి పథకంలో పనులకు వెళ్లిన కూలీలకు పనిచేసిన 10 రోజుల లోపలనే వేతనాలు చెల్లించాలి. వేతనాలు ఆలస్యమైతే కుటుంబ పోషణ భారంగా ఉంటుంది. 8 వారాల నిరీక్షణ అనంతరం బుధవారం ఉపాధి వేతనాలు జమయ్యాయి.

- వెంకటరమణుడు, ఉపాధి కూలీ, సింహాద్రిపురం.

ఉపాధి కూలీలకు వేతనాలు జమవుతున్నాయి...

జిల్లావ్యాప్తంగా ఉపాధి పథకం కింద పనులకు వచ్చిన ఉపాధి కూలీలకు వేతనాలు బుధవారం నుంచి జమవుతున్నాయి. జిల్లాలో రూ 40 కోట్లు పెండింగ్లో ఉన్న విషయం వాస్తవమే. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చాలా మండలాలలో కూలీలకు జమ చేశాం. త్వరలోనే అందరికీ కూలీల వ్యక్తిగత ఖాతాలకు జమ అవుతుంది.

- ఆదిశేషారెడ్డి, డిడబ్ల్యూఎంఎ ప్రాజెక్టు డైరెక్టర్, కడప.

ఎంఎస్ఎంఇల సాధికారతతోనే ఆర్థిక పరిపుష్టి

- పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - కడపఅర్బన్

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) సాధికారతతోనే రాష్ట్ర సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అవుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ ఎంపవర్మెంట్ రిలేషన్స్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని విజిలెన్స్ హాలులో జిల్లాలో ఎంఎస్ఎంఇ, సెర్ప్ కార్యకలాపాలపై కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్‌లు, కడప, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు ఆర్. మాధవి, సి.ఆదినారాయణరెడ్డి, జెసి అదితి సింగ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో వ్యాపార, పెట్టుబడి ధోరణిలో పారిశ్రామిక రంగం వైపు అవగాహన పెంచి పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు. పరిశ్రమలలో ఒక భాగంగా ఉన్న ఎంఎస్ఎంఇ విభాగాన్ని ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంగా ఒక పాలసీని తీసుకురావడం, అందుకు సంబంధించి 'ఉద్యం' పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరూ ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రభుత్వం నుంచి అందే అన్ని రకాల రాయితీలను పొందేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని ఆ దిశగా మహిళలను యువతను జిల్లా అధికారులు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల కేంద్రం కింద రూ. 17,012.48 కోట్ల పెట్టుబడులతో మొత్తం 28 భారీ పరిశ్రమలు నడుస్తున్నాయని, దాదాపు 16,208 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని వివరించారు. అలాగే జిల్లాలో ఎంఎస్ఎంఇ వివరాలను తెలియజేశారు. కొప్పర్తి పారిశ్రామిక వాడను రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. కడప ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఇండస్ట్రీలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇండస్ట్రీలో మ్యాన్ పవర్ అవసరం చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రియల్ జిఎం చంద్ బాషా, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, డిపిఎంలు, ఎపిడిలు, మెప్మా సిఎంఎంలు, సెర్ప్ సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఎపిఐఐసి నుంచి సేల్ రిజిస్ట్రేషన్లు చేయించండి

సేల్ రిజిస్ట్రేషన్ల సమయంలో ఎపిఐఐసి నుంచి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిశ్రమల యజమానులు కోరారు. గురువారం జిల్లా పర్యటనకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను వారు కొప్పర్తి పారిశ్రామికవాడలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిఐఐసి ద్వారా తాము భూములు కొనుగోలు చేసి నిబంధనల మేరకు పరిశ్రమలు నెలకొల్పి నడుపుతున్నామన్నారు. ఎపిఐఐసి వద్ద తాము తీసుకున్న భూమిలో 50 శాతానికి పైగా వినియోగించి అన్ని రకాల అనుమతులు పొందామన్నారు. ఈ క్రమంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పరిశ్రమలను నడుపుతున్నామని, నిబంధనలను అనుసరించి తమకు సేల్ రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వాల్సిన అధికారులు ఇవ్వడం లేదని చెప్పారు. సూక్ష్మ పరిశ్రమలకు పిఎఫ్, ఇఎస్ఐలతో నిమిత్తం లేకుండా ఎపిఐఐసి సేల్ రిజిస్ట్రేషన్లు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొప్పర్తి, మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు పల్లేటి రమణారెడ్డి, మదన్‌కుమార్, కిశోర్‌బాబు, కేవీ సురేష్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులు

- డిప్యూటీ సూపరింటెండెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని ఓ ఆర్‌టిసిలో డిపోలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పై లైంగిక వేధింపులకు పాల్పడిన డిప్యూటీ సూపరింటెండెంట్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఆర్ఎం గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ఉద్యోగుల పట్ల ఎంతటి స్థాయి అధికారి అయినా లైంగిక వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉచిత డిఎస్‌సి కోచింగ్ అభ్యర్థుల పాలిట వరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యుటిఎఫ్‌చే నిర్వహించే ఉచిత డిఎస్‌సి కోచింగ్ అభ్యర్థులకు వరం లాంటిదని కడప ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో డిఎస్‌సి ఉచిత కోచింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ని నిర్వహిస్తుందని, కేవలం 45 రోజులు మాత్రమే పరీక్షలకు సమయమున్న పరిస్థితులలో అభ్యర్థులు, ఆశావాహులు కోచింగ్ కోసం వేలాది రూపాయలను వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన అవసరం లేకుండానే కడపలోని యుటిఎఫ్ భవన్‌లో యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా కోచింగ్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏలాంటి లాభాపేక్ష లేకుండా నవతరం ప్రభుత్వ ఉపాధ్యాయులను తయారు చేయాలనే సంకల్పంతో ఈ కోచింగ్ ను నిర్వహిస్తుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం యుటిఎఫ్ తన వంతు పాత్రను పోషిసుందన్నారు. డిఎస్‌సి ఆశావాహులు తమ కలలను సాకారం చేసుకునేందుకు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సుదర్శన్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కేదార్నాథ్, శంకర్ రెడ్డి, ప్రకాష్ బాబు, శివశంకర్, శివకుమార్ రాజు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అట్లూరు

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో పిల్లలు వాగులు, చెరువులు, కుంటలు, బావులలో ఈత కొట్టేందుకు వెళ్లే అవకాశం ఉన్నందున పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అట్లూరు సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటివరకు పాఠశాలలో చదువుకొని ఇంటికి వచ్చిన పిల్లలు సరదాగా గడిపేందుకు బయటకు వెళతారని తెలిపారు. అటువంటి సమయాలలో పిల్లల తల్లిదండ్రులు వారిపై నిఘా పెట్టాలన్నారు. విపరీతమైన ఎండలు కాస్తున్నందున పిల్లలను బయటకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఎస్ఐవిజ్ఞప్తి చేశారు.

ఉచితంగా వడుగులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నూర్‌బాష్ దూదేకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వడుగులు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి సంవత్సరమూ ఎండాకాలం ఆనవాయితీగా జిల్లా దూదేకుల భవనంలో కార్య క్రమం నిర్వహిస్తున్నామని జిల్లా గౌరవ అధ్యక్షులు ఆయిల్ మిల్ ఓబు లేసు, జిల్లా అధ్యక్షులు ఖాదరయ్య, ప్రధాన కార్యదర్శి మస్తాన్, ఉపాధ్య క్షులు సుభాన్, కోశాధికారి అజ్మతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత ఒడుగులు డాక్టర్ ఎజాజ్ అహ్మద్, డాక్టర్ కరిముల్లా యూరాలజీ సర్జన్, డాక్టర్ ఫయాజ్, డాక్టర్ సద్దాం హుస్సేన్ చేశారని చెప్పారు. గోధుమపిండి, నెయ్యి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

ఎన్‌జిఒ హోం ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పట్టణంలో నూతనంగా నిర్మించిన ఎపి ఎన్‌జిఒ హోం ప్రారంభోత్సవానికి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు ఆహ్వానించారు. మే 1న ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. గురువారం మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, రాయచోటి అధ్యక్షులు డి.వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు టి. శ్రీనివాసులు, కోశాధికారి పి. నిత్యపూజయ్య, రాయచోటి కార్యదర్శి శ్రీనివాసులు, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఆర్. జయచంద్ర, కోశాధికారి బి. దేవేంద్ర, ఉపాధ్యక్షులు హరిప్రసాద్ పాల్గొన్నారు.

తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు వేసవి సెలవులలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి హెచ్చరించారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో విద్యార్థుల ఆరోగ్యం కోసం ఈనెల 23 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్నాయని చెప్పారు. విషయం తెలిసిన కూడా మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా ప్రవర్తించడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటి నుంచి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలను అడ్డుకుని వారిపై చర్యలు తీసుకునేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రంపల్లి అజయ్ పాల్గొన్నారు.

బిఇడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బిఇడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం వైవీయూ రిజిస్ట్రార్ పద్మ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న బిఇడి కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. కళాశాలలో స్టాఫ్ ఉండరని, కనీసం ల్యాబ్ సౌకర్యం కూడా లేదని తెలిపారు. బయటి రాష్ట్రాల నుంచి అడ్మిషన్లు నిర్వహించుకుంటూ వేల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారని తెలిపారు. చాలా కళాశాలలు కనీసం తరగతి గదుల తాళాలు తీసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికే యాజమాన్యాలు ఎడ్ సెట్ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అక్రమంగా అడ్మిషన్లు బయటి రాష్ట్రాల నుంచి చేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బిఇడి కళాశాల యాజమాన్యాలపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమ్మె బాటలో మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రంకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 20 నుంచి 30 సంవత్సరాలు పైబడి కడప నగరంలో ప్రజలకు, కార్మికులు సేవలు అందిస్తే ప్రభుత్వం, నగరపాలక సంస్థ వారి సేవలు గుర్తించకుండా, కనీసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా తొలగించడం దారుణమని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులు వెళ్లకట్టలేనంత సేవలు చేసినప్పటికీ ప్రభుత్వం వారి కష్టాన్ని గుర్తించకుండా 60 ఏళ్ల వయసు పైబడిందని 'మిమ్మల్ని డిటెక్ట్ చేసి ఇంటికి పంపిస్తాను' అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 60 సంవత్సరాలు నిండిన వారిని వయోపరిమితి రెండేళ్లకు పెంచి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్, పింఛన్ రూ.10 వేలు ఇచ్చి ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మే 2 తర్వాత ఏరోజైనా సమ్మెలోకి వెళ్తామని అధికారులకు సమ్మె నోటీస్ ద్వారా హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులపై తీసుకుంటున్న విధానానికి వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కడప నగరంలో మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి, ఉపాధ్యక్షులు ఇత్తడి ప్రకాష్, సుంకర కిరణ్, నాగరాజు, అరుణ్, ఆదాం, కార్మికులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య

- ముష్కరులను కఠినంగా శిక్షించాలి
- కడప అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అని, దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ తెలిపారు. గురువారం అంబేద్కర్ సర్కిల్‌లో హంతక ముఠాల తుపాకి గుండ్లకు బలైన వారికి ప్రగాఢ సంతాపాన్ని ,వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకుల దుష్ట చర్యలను సమస్త సమాజం ఖండించాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతగానితనం కారణంగానే ఉగ్ర దాడులు జరుగుతున్నాయని ఆక్షేపించారు. ఉగ్రవాదులు ఎక్కడో దాక్కొని అమాయకులైన ప్రజల పైన తుపాకీ తూటాలు ఎక్కు పెట్టడం నీతిమాలిన చర్య అని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్లో శాంతిభద్రతలను పునరుద్ధరించామన్న మోడీ, అమిత్ షా ప్రచారం బూటకమని తేలిపోయిందన్నారు. ఇప్పటికైనా జమ్ము కాశ్మీర్ ప్రజల సమస్యలకు రాజకీయ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు ఉన్నత స్థాయి వైద్యం అందించాలని పేర్కొన్నారు. అందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రదర్శలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, శివకుమార్, కుమారస్వామి రెడ్డి, విజయ్, నరసింహ, గోవిందు, రవి, అజయ్ రాహుల్, ఉదయ్, శ్రీను, సురేంద్ర, సాయి పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండించాలి : జమ్మూ , కాశ్మీర్‌లోని పహల్గాం జిల్లాలో పర్యాటకులపై జరిగిన దాడిలో పౌరులు హతమయ్యారని, ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మృతుల కుటుం బాలకు సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ హత్యలు కాశ్మీరీ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుకూలంగా లేవన్నారు. ఏ మతానికి మేలు చేసేవీ కావు అన్నారు. ముఖ్యంగా ముస్లిం సమాజం వీటికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి నిరసన తెలపడం, గాయపడ్డ వారికి సహాయ సేవ పరిచర్యలు చేయటం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. కేంద్ర ప్రభుత్వ రాజకీయ, పరిపాలనా వైఫల్యానికి నిలువెత్తు ఉదాహరణ ఈ ఘటన అని, దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడులను నిలిపివేయడానికి ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



పులివెందులటౌన్ : కొవొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం : దేశంలో ఉగ్రవాదం అంతమయ్యే వరకు తమ వంతు పాత్రను పోషించి ఉద్యమిస్తామని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గళమెత్తారు. గురువారం జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడుల్లో మరణించిన వారికి నివాళి అర్పించారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల నుంచి ఎన్‌సిసి, పాఠశాల విద్యార్థులతో కలిసి శాంతియుత ర్యాలీని నిర్వహించారు. పాత బైపాస్ సర్కిల్ వరకు జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీగా వచ్చి అనంతరం అక్కడ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, పాఠశాల ఇన్‌ఛార్జి సంధ్య, పిఇటి చంద్ర, ఎఒ చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ, నిరసన

కడప : ఉగ్రవాద దాడిని నిరసిపూ ఈనెల 25న న్యాయవాదులు విధులు బహిష్కంచి ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి అన్నారు. గురువారం కడప బార్ అసోసియేషన్ హాలులో అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని తీవ్రంగా నిరసించారు కిరాయి మూకల, హంతక ముఠాల తుపాకీ గుండ్లకు బలైన వారి కుటుంబాలకు సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. **అట్లూరు :** పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానుషమని సిపిఎం మండల కార్యదర్శి ఇ. రమణయ్య పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో ఆశువులబాసిన 27 మంది మృతికి సిపిఎం ఆధ్వరంలో నివాళులర్పించారు. శ్రద్ధాంజలి ఘటిస్తూ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

భారత ప్రభుత్వం ఉగ్రవాదులను ఏరివేతలో నిర్లక్ష్యం హించకుండా వారిపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి. రవిచంద్ర గోపయ్య పెంచలయ్య బి. స్వప్న వి.లతమ్మ పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా పట్టణంలో పార్టీలకతీతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గురువారం సాయంత్రం పాత బస్టాండ్ నుంచి పూల అంగళ్ల సమీపం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ డౌన్ డౌన్, ఉగ్రవాదులను వెంటనే హతమార్చాలి, ఉగ్రవాదం నశించాలి, హిందూ ముస్లింల ఐక్యత వర్ధిల్లాలి, వందే మాతరం, పాకిస్తాన్ వక్ర బుద్ధి మానుకోవాలి, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. పూలంగల సర్కిల్ వద్ద వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మరణించిన వారికికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో శశిభూషణ్ రెడ్డి, తుగుట్ల మధుసూదన్ రెడ్డి, గంగాధర్‌రెడ్డి, ముస్లిం నాయకులు, హిందూ ఐక్యత సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : జమ్మూ కశ్మీర్ అహల్గామ్‌లో జరిపిన ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం ఎదుట జనసేన పార్టీ రాయలసీమ జోన్ డాక్టర్స్ సెల్ కార్యదర్శి డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున ఆధ్వర్యంలో జనసేన కన్నీటి నివాళి అర్పిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా ఉగ్రవాదం నశించాలి, మానవతా దృక్పథం మేల్కొనాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడేకుల రమణ, శ్రీరామ్ వంశీ, బీదం నవీన్‌కుమార్, చెన్నకృష్ణయ్య, సాదు కిషోర్, సి.సుబ్బారాయుడు, ఎల్.పవన్‌కుమార్, ఉదయ్, సాయి, పుల్లయ్య, శ్రీను, ప్రసాద్, వెంకటేష్, శేఖర్‌రెడ్డి, ఆది, నరసింహరెడ్డి, సుధాకర్, మహ్మద్ వలి, షేక్ వలి, సెభాస్టియన్, కొండాపురం నరసింహ, కేశవ పాల్గొన్నారు. **ఖాజీపేట**: కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కడియాల మహమ్మద్ ఫయాజ్, రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నంపాటి వెంకటరమణ, వైసిపి జిల్లా జనరల్ సెక్రటరీ పివి రాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ కూడలి నుంచి అంబేద్కర్ కూడలి వరకు నిరసన వ్యక్తపరిస్తూ కొవ్వులతో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు. ఉగ్రవాదులు కాల్పులు జరపడం క్షమించరాని, హేయమైన చర్యఅని టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. టిడిపి మండలం సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, నాయకులు ఇట్టెం శ్రీరాముల యాదవ్, ముస్లిం మైనారిటీ నాయకులు సిద్దారం ఖదీరుల్లా, కమలాపురం ఫరూక్ అహ్మద్, కమలాపురం గౌస్, లక్కు పుల్లారెడ్డి, కృష్ణ యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. **ప్రొద్దుటూరు :** రెండు రోజుల క్రితం జరిగిన ఉగ్రవాదుల దాడి ద్వేషపూరిత చర్య అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రొద్దుటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ త్యాగరాజ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయి ప్రసాద్, కోశాధికారి డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. **చాపాడు :** మైదుకూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నాలుగు రోడ్ల కూడలిలో నిరసన తెలిపారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు శివరాం, శ్రీనివాసులు, నాగిరెడ్డి, జెకె చారి, అబ్దుల్లా, భాస్కర్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



మైదుకూరు : మానవహారంగా ఏర్పడిన న్యాయవాదులు



కడప అర్బన్ : ఉగ్రవాదుల దిష్టిబొమ్మదగ్ధం చేస్తున్న విద్యార్థులు



జమ్మలమడుగు : మౌనంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


నేటి నుంచి పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

- రోజూ విశేష పూజలు, వాహన సేవలు

ప్రజాశక్తి - వల్లూరు

దక్షిణకాశిగా పేరొందిన పుష్పగిరి క్షేత్రంలో హరిహరుల బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి వైభవోపేతంగా ప్రారంభం కానున్నాయి. చెన్నకేశవస్వామి ఆలయ అర్చకులు వైద్యనాథేశ్వరస్వామి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వామి వార్లకు పూజలు నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేశారు. ఈనెల 25 నుంచి మే 4 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు.. 25 శుక్రవారం ఉదయం విశేష పూజ, పుణ్యాహవాచనం, దీపారాధన రక్షాబంధనం, మేదినీ పూజ, అంకురార్పణతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 26న తిరుచి వాహనం, ఉదయం 5 గంటల నుండి సుప్రభాత సేవ , అభిషేకం, తోమాల సేవ నిర్వహించనున్నారు. 2న హంస వాహనం సుప్రభాత సేవ , అభిషేకము, తోమాల సేవ ,పూజ ,నిత్య హెూమాలు, బలిదానం 28న యాలి వాహనం సుప్రభాత సేవ, అష్టోత్తర, కలశాభిషేకం, యాగశాల, పూవాహ 29న చందనాలంకరం ఉంటుంది. నుమత్ వాహనము, చంద్రోత్సవం నిత్య హోమం, నిర్వహిస్తారు. 30న అక్షయ తృతీయ పురస్కరించుకొని స్వామివారికి పూలంగి సేవ, గరుడ వాహనం నిర్వహించనున్నారు. 1న గజ వాహనం ఉదయం 5 గంటల నంచి సుప్రభాత సేవ, యాగశాల పూజ ,నిత్యహోమం నిర్వహిస్తారు. అదే రోజు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. 2న రథోత్సవం, 3న అశ్వ వాహనం, సుప్రభాత సేవ, ప్రాతక్కాల ఆరాధన, నిత్య హోమాలు ఉంటాయి. 4న సాయంత్రం నాలుగు గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. స్వామి వారికి శ్రీ చక్ర స్నానం తో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగాయనున్నయి. **బండలాగుడు పోటీలు..** పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఓల్డ్ కేటగిరి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ నెల 30న అక్ష య తృతీయ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



పుష్పగిరి దేవస్థానం


మాట్లాడుతున్న ఎంపిపి అరుణ

అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అందరి సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎంపిపి అరుణ పేర్కొన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు తోడ్పాటునివ్వాలన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపిడిఒ కార్యాలయ ఎఒ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలలోపు ఉన్నవారు బీమా చేసుకోవాలని కోరారు. వివరాల నిమిత్తం ఆయా గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. తహశీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను చాలావరకు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 ఓబులేసు, ఎఇ శివమోహన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శశివర్ణ, హౌసింగ్ ఎఇ వాసుదేవ రెడ్డి, ఉపాధి హామీ జయ భారతి, డిఆర్‌డిఎ ఎపిఎం మంజునాథ్, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)



మైదుకూరు మండలంలోని గడ్డంవారిపల్లి మోటు గుట్ట వద్ద తెలుగుగంగ కాలువను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు బిపి ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా మోటుగుట్ట నుంచి ఓ కంపెనీ వారు గ్రావెల్ తరలిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా తెలుగుగంగ కాలువను గ్రావెల్‌తో పూడ్చి తరలిస్తున్నారన్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జడ్‌పి బాలికల పాఠశాల విద్యార్థి మండల సెకండ్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


బిందులతకు స్వీట్ తినిపిస్తున్న వార్డెన్ నాగేశ్వరమ్మ

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఏ.బిందులత మండల సెకండ్‌గా నిలిచింది. 579 మార్కులతో తన ప్రతిభను చాటింది. ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులు కార్పోరేట్ విద్యా సంస్థలకు ధీటుగా మార్కులు సాధించడం పట్ల ప్రజలు, ఉపా ధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. బిందులత ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ చదువుపై శ్రద్ధ కనబరచి ఈసారి పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిందని, తాలుకా స్థాయి హాస్టల్ విద్యార్థుల్లో టాప్ స్థానంలో నిలిచిందని ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ నాగేశ్వరమ్మ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని బిందులతను అభినందించారు.

టెన్త్‌లో మెరిసిన 'గీతాంజలి'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


మోపూరు వెంకట లావణ్య

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో గీతాంజలి విద్యార్థులు మెరిశారు. ఈ పాఠశాల నుండి మోపూరు వెంకట లావణ్య 591 మార్కులు సాధించి ప్రథమ శ్రేణిలో నిలిచారు. పాఠశాల నుండి 43 మంది విద్యార్థులుండగా వందశాతం పాసయ్యారు. కాగా 500పైబడి 17 మంది మార్కులు సాధించారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులకు, సహకరించిన తల్లిదండ్రులకు, తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు కరెస్పాండెంట్ శివనాగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

రాయితీతో వేరుశనగ విత్తనాలు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - చక్రాయపేట

50శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలు కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఒ నవంత్‌బాబు గురువార ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో పంట సాగుకు బోరు, బావుల ఆధారంగా వేరుశనగ సాగు చేసే రైతులకు 50 శాతం సబ్సిడీతో విత్తన కాయలు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌లింక్ అయిన మొబైల్‌ఫోన్ వెంట తెచ్చుకుని రైతు సేవ కేంద్రం సహాయకులను సంప్రదించి రిజిష్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

లింగాల : వేసవిలో బోర్ల కింద పంటలు సాగు చేసే రైతులకు 50 శాతం రాయితీతో విత్తనాలను అందిస్తూన్నామని, దరఖాస్తు చేసుకోవాలని ఎఒ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ, మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ సీడ్స్ పథకం కింద 50శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సంబంధిత రైతులు శుక్రవారం నుంచి రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పత్రాల్లేని 34 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎస్‌పి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిఐ దస్తగిరి స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్, ఎస్వీ గిరి కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాలనీల్లోని ప్రతి ఇంటిని, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పత్రాలు సరిగాలేని 34 మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ దస్తగిరి చెప్పారు. బైకు ఉన్న ప్రతి ఒక్కరూ సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లు మోటర్ సైకిళ్లు నడపడం చట్టరీత్యా నేరం అన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు బైకులు ఇవ్వకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్‌లో యర్రగుంట్ల, కొండాపురం సిఐలు నరేష్ బాబు, మహ్మద్ రఫీ, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఎఎస్ఐ శ్రీనివాసులు, సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బైకులతో సిఐ దస్తగిరి

పంట కాలువలు ఇలా.. పట్టకపోతే ఎలా..?

కెసి కెనాల్ చివరి ఆయకట్టు రైతుల ఆవేదన.. నీటి సంఘాలైన పట్టించుకోవాలని విన్నపం

ప్రజాశక్తి - ఖాజీపేట


పత్తూరు కాశినాయన ఆలయం వద్ద పూడికతో ఉన్న కెసి ఉపకాలవ

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి సమయం దగ్గరపడుతోంది. సాగునీటికి ప్రధానమైన కెసి కాలువ అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదు. పంట కాలువలు పూడికతో నిండిపోవడం, కాలువకు ఇరువైపులా లైనింగ్ దెబ్బ తినడం, కాలువల వెంబడి కంపచెట్లు పెరగడం, పలుచోట్ల తూము లకు షెట్టర్లు లేకపోవడం వంటి అనేక కారణాల వల్ల ఆయకట్టు ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ఎక్కువ భాగం రైతులు కెసి కాలువపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. ఖాజీపేట ప్రాంతం కెసి కాలువకు చివర కావడంతో ప్రతి ఏటా సాగునీరు ఆలస్యంగా వచ్చి చేరుతోంది. రైతులు పంటలు సాగు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. వరి పంటను ఆలస్యంగా సాగు చేసుకోవాల్సిన పరిస్థితి. పంట చేతికి వచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. కెసి ఆయకట్టు ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే సాగునీటికి ఇబ్బందులు ఉండవని, సకాలంలో పంటలను సాగు చేసుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ ఆధారిత మోటర్లు ఉన్న రైతులు ముందుగానే పంటలు సాగు చేసుకోవడం వల్ల తమకు సమస్యలు ఎదురవుతున్నాయని, కెసి ఆయకట్టు ద్వారా సకాలంలో సాగునీరు అందితే పంటల సాగుకు ఇబ్బందులు ఉండదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో కెసి ఆయకట్టు అభివృద్ధికి ఇదే మంచి తరుణమని సూచిస్తున్నారు. కాలువలో పూడికతీత చేపట్టడం, ఉప కాలవలను అభివృద్ధి చేయడం, కాలువల వెంబడి కంపచెట్లను తొలగించడం, దెబ్బతిన్న లైనింగ్‌కు మరమ్మతులు చేస్తే ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఇటీవలే సాగునీటి సంఘాలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని, నీటిపారుదల శాఖ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, ప్రాజెక్టుల చైర్మన్లు కెసి ఆయకట్టు ప్రాంతంపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా కెసి ఆయకట్టు ద్వారా వేలాది ఎకరాలు పంటలు సాగుతున్నాయి. కెసి ఆయకట్టు ద్వారా సాగు నీరు చివరి ప్రాంతం వరకు అందేలా చర్యలు చేపడితే వ్యవసాయ మోటర్లలో కూడా నీటిమట్టం పెరుగుతుంది. రెండు పంటల సాగుచేసుకునేందుకు అవకాశం కలుగు తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల మరమ్మతులపై శ్రద్ధ వహించాలని రైతులు కోరుతున్నారు.

గొంతు ఎండుతోంది.. గుక్కెడు నీళ్లివ్వండి..


నీటి కోసం పడిగాపులు కాస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కష్టాల్లో ఉన్న ప్రజలకు ఆసరాగా ఉండాల్సిన గ్రామ సర్పంచు, పరిపాలనా అధికారులు నీటి సమస్యను పరిష్కరించడంలో అలసత్వం ఒకవైపు ఉంటే, మరోవైపు దళిత కాలనీ అని చిన్నచూపు చూస్తూ ఆ కాలనీలోకి తాగు రు రాకుండా గ్రామంలోని వ్యక్తులు అడ్డుకుంటున్న సంఘటన మైలవరం మండలం చిన్న వెంతుర్ల గ్రామంలో చోటుచేసుకుంది. అసలే వేసవి, ఎండలు మండిపోతున్నాయి. గ్రామంలోని వారు ఎస్‌సి కాలనీలోకి వచ్చే పైపులైన్‌కు నీరు రాకుండా అడ్డు పడుతున్నారని, పొలాల్లోకి బిందెలు తీసుకొని వెళితే కొందరు మానవతా దృక్పథంతో వ్యవహరిస్తే, మరి కొందరు మోటర్లు కాలిపోతాయి నీటికోసం రావద్దని అంటున్నారు. మాకు నీళ్లు ఇవ్వమంటే అటు సర్పంచు, ఇటు అధికారులు పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుక్కెడు తాగునీటి కోసం 4 నెలల నుండి ఇబ్బంది పడుతున్నాం. ఓట్ల కోసం అయితే వస్తారు.. నీళ్ళు ఇవ్వమంటే పట్టించుకోరు ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. పనికి వెళ్లాలా? నీళ్లు పట్టుకునేందుకు కాపలా ఉండాలా..! చెప్పండి అని ఖాళీ బిందెలు, డ్రమ్ములతో గురువారం ధర్నాకు దిగారు. గ్రామంలో వివక్షను వీడి మాకు నీరు ఇవ్వాలని కోరుతున్నారు. ఇది ఇలా ఉంటే నియోజకవర్గంలో మైలవరం, జమ్మలమడుగు మండలాల్లో తాగునీటి కొరతపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించడంలో విఫలం చెందారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కూడా వద్ది రాలలోని జంగం కాలనీ వారు కూడా నీటి కోసం ఇబ్బంది పడ్డారు. జమ్మల మడుగు మండలం రాజీవ్‌నగర్ కాలనీ పెన్నా నదికి పక్కలో ఉన్నా నీటి కోసం అవస్థలు పడితే ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ట్రాక్టర్‌ల ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నారు.

ఆలయానికి పూర్వ వైభవం తెచ్చాం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


కోనేరును ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

శ్రీరంగనాథ స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చామని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. స్థానిక రంగనాథ స్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కోనేరును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ముఖ్య మంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రంగనాథస్వామి ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు రూ.కోట్లతో ఆలయ అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూ జలు చేసి జల హారతి ఇచ్చి కోనేరును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆల య కమిటీ చైర్మెన్ సుధీకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్ మూలి మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కోడి రమణ, రసూల్, వీరారెడ్డి, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, కోళ్ల భాస్కర్, బాటరీ ప్రసాద్, కనక గంగాధర్, పద్మనాభరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కొరవడిన పర్యవేక్షణ

గత ప్రభుత్వంలో పులివెందులలో చేసిన అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వ పర్యవేక్షణ లేదని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. అరటి రైతుల కోసం రూ.25 కోట్లతో గత ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్ నిర్మించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ స్టోరేజ్‌ను వినియోగంలోకి కూడా తేలేదని విమర్శించారు. పులివెందులకే తలమానికమైన మెడికల్ కాలేజీకి సీట్లు వస్తే ఈ ప్రభుత్వం వాటిని వెనక్కి పంపారని విమర్శించారు. జమ్మూకశ్మీర్ ప్రస్తుతం ప్రధాన పర్యాటక రంగంగా మారిందన్నారు. ఇక్కడికి దేశంలోని రాష్ట్రాల వారే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా పర్యాటకులు వస్తున్నారని, ఈ సమయంలో టూరిస్టులపై ఉగ్రదాడి అత్యంత బాధాకరమన్నారు. దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పెన్షన్ సవరణ బిల్లు ఆమోదం దుర్మార్గం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఓ వైపు పాత పెన్షన్ అమలుకు ఉద్యోగుల అంతా కలిసి పోరాటం చేస్తుంటే.. ఆవేమీ పట్టనట్లు కేంద్ర ప్రభుత్వం ఉందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో గురువారం ఎస్‌టియు నూతన కార్యాలయాన్ని కత్తి నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత పింఛన్ దారులకు హాని చేసేలా పెన్షన్ సవరణ బిల్లు పేరిట 2025-26 ఆర్థిక బిల్లులో మార్చి25న గుట్టు చప్పుడు కాకుండా లోక్‌సభచే ఆమోదింపజేసిందన్నారు. ఈ బిల్లు త్వరలోనే రాజ్యసభలో కూడా ఆమోదిస్తే తర్వాత రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారనుందన్నారు. అనంతరం ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహించడంతోపాటు వివాదరహితంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అన్నారు. చివరి దశలో ఒక సామాజిక భద్రతా పథకమని, అలాంటి పెన్షన్ తొలగింపునకు ప్రభుత్వాలు కుట్రలు చేయరాదని చెప్పారు. సుప్రీంకోర్టు ఎన్నోసార్లు ప్రభుత్వాలను ఆదేశించినా కుటిల నీతితో దుర్మార్గపు ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, రషీద్‌ఖాన్, సుబ్రమణ్యం రాజు, సుధాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ శివారెడ్డి, రవిశంకర్ రెడ్డి, గురుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - సింహాద్రిపురం


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

మండలంలోని అంకాలమ్మ గూడూరులో వెలసిన శ్రీఅంకాలమ్మ అమ్మ వారు తిరుణాల అంగరంగ వైభవంగా సాగింది. గురువారం ఉదయం అమ్మ వారికి ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

ఎడ్లచే బండలాగుడు పోటీలను మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి), వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో 18 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి స్థానం సాధించిన ఎద్దుల యాజమాన్యులకు రూ,80 వేలు, రెండవ స్థానం సాధించిన ఎద్దులకు రూ.70 వేలు, మూడో స్థానం సాధించిన ఎద్దులకు రూ.60 వేలు అందజేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోమ కొండారెడ్డి, టిడిపి నాయకులు వెలుగోటి బాబురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'పీస్'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

మరియాపురం, కాగితాలపెంటలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల్లో గురువారం గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు పద్యాలు, అరబిక్ స్పీచ్ అద్భుతంగా ఇచ్చారన్నారు. పిల్లలు చక్కగా అభినయించారని తెలిపారు. ఎస్ఎ-2 ర్యాంకర్స్‌కు మెడల్స్, సైన్స్ ఎక్స్‌పోలో చక్కని ప్రదర్శన చేసిన వారికి మెడల్స్, యుకె.జి విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశామన్నారు. పది ఫలితాల్లో 575, 520, 514, 500 మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లి దండ్రులను సన్మానించారు.



విద్యార్థులతో డైరెక్టర్ గౌస్ పీర్



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట

అభివృద్ధికి గ్రామ పంచాయతీలు పట్టుకొమ్మలాంటివని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని భూమాయపల్లె పంచాయతీలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్షుమయ్య

పంచాయతీల అభివృద్ధితోనే గ్రామ స్వరాజ్యం

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని ఎంపిపి టి.లక్షుమయ్య పేర్కొన్నారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ రాజ్ ప్రాముఖ్యత ముఖ్యమైందన్నారు. అనంతరం ఎంపిపి, సర్పంచ్‌ను సిబ్బంది సన్మానించారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి, ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ మహబూబ్ బీ, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల్లా పంచాయతీ రాజ్ వ్యవస్థలు

- పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాల పాలనలో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు విధులు, నిధులు, అధికారాలు లేక నిర్వీర్యమై ఉత్సవ విగ్రహాల్లా తయారైనట్లు పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్తులకు, జిల్లా పరిషత్తులకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిందన్నారు. రాజ్యాంగంలో 11వ షెడ్యూల్ కింద వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, గ్రామీణ మౌలిక సదుపాయాలు వంటి 29 అంశాలు పంచాయితీ రాజ్ సంస్థలు నిర్వహించాల్సి ఉందని చెప్పారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అధికారాలు బదలాయించలేదన్నారు. ఈ అంశాలను వెంటనే బదలాయించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

రుణాల మంజూరులో నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - వేంపల్లె


మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రుణాలు మంజూరు చేయ డంలో అధికారులు నిబంధనలను సడలించాలి బ్రహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు రఘునాథ్‌రావు, పివి ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ క్రెడిట్ రుణాలు మంజూరులో నిబంధనలను సడ లించాలని విజయవాడలోని క్రెడిట్ సొసైటీ అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వ్యక్తిగత రుణాలు పొందాలంటే ఒక ఐటి రిటర్న్ లేక ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ ఇవ్వవలసి ఉందన్నారు. నిబంధనలు ఎక్కువగా ఉండడంతో రుణాలకు దరఖాస్తులు చేసుకోలేక పోతున్నట్లు చెప్పారు. సొసైటీలో సభ్యత్వంగల ముగ్గురి వ్యక్తులతో ష్యూరిటీ తీసుకొనేలా నిబంధన మారిస్తే బాగుంటుందని సూచించారు. సంఘాల నాయకులు తమ సంఘాల డిపాజిట్‌లను బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ బ్యాంక్‌లో చేస్తే ఎక్కువ వడ్డీ వస్తుందన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఖాజీపేట


పశు వైద్య శిబిర ప్రారంభోత్సవంలో అధికారులు

మండల పరిధిలోని సన్నపల్లె గ్రామంలో పశు వైద్య కళాశాల ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జబ్బు చేసిన పశువులు ఉంటే చికిత్స చేయించుకోవాలని సూచించారు. జీవాలకు నట్టల నివారణ మందులను తాపించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు వేణుగోపాలరెడ్డి, డిడి రమణయ్య, ఎడి రాజశేఖర్, డాక్టర్ మురళి, ఎన్ఎస్ఎస్ అధికారి ఇందిర, అధ్యాపకులు పృథ్వీధర్ రెడ్డి, విద్యాసాగర్, విజయ్‌కుమార్, రాయలరెడ్డి, సురేంద్ర, యుగంధర్, పశు వైద్యాధికారులు లక్ష్మయ్య, బాబు రామచంద్ర, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.